518) మాళవిగౌళ

ప|| నీవు సర్వగుణసంపన్నుడవు నే నొకదుర్గుణుడను|
మానవు నన్నొకయెదురుచేసుకొని మనసుచూడనేలా అయ్యా||

చ|| యేలినవాడవు నీవు ఇటు నే గొలిచినవాడ|
పోలింపగ నీవే దేవుడవు భువి నే నొకజీవుడను|
పాలించేవాడవు నీవు బ్రదికేవాడను నేను|
తాలిమి నన్నొకసరిచేసుక నను దప్పులెంచనేలా అయ్యా||

చ|| అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను|
చింతింపగ నీవే స్వతంతుడవు జిగి నే బరతంత్రుడను|
ఇంత నీవే దయగలవాడవు యెప్పుడు నే నిర్దయుడను|
చెంతల నన్నొకమొనసేసుక నాచేత లెంచనేలా నయ్యా||

చ|| శ్రీవేంకటేశ్వరుడవు నీవు సేవకుడను ఇటు నేను|
ఆవలనీవల దాతవు నీవు యాచకుడను నేను|
నీవే కావగ గర్తవు నేనే శరణాగతుడను|



కైవశమగు నను ప్రతిపెట్టుక నాకథలు యెంచనేలా అయ్యా||